పోలింగ్ బూత్‌ల పంపిణీకి సర్వం సిద్ధం

రిటర్నింగ్ అధికారి మల్లయ్య


ఎన్నికల సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు

రాజేంద్రనగర్ : నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సామాగ్రితో పాటు సిబ్బందిని చేరవేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రిటర్నింగ్ ఎన్నికల అధికారి మల్లయ్య తెలిపారు. ఎన్నికల విధుల కోసం 6 వేల సిబ్బందిని నియమించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి బూత్‌లో ఒక ప్రొసిడింగ్ అధికారి, మరో అసిస్టెంట్ ప్రొసిడింగ్ అధికారితో పాటు ఇద్దరు సహాయకులు ఉంటారన్నారు. వీటికి తోడు పోలీసులు, స్థానిక ప్రభుత్వ సిబ్బంది పని చేస్తారన్నారు. నియోజకవర్గంలో 542 పోలింగ్ బూత్‌లలో వెబ్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ వెబ్ కెమెరాల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తామన్నారు.

- రాష్ట్ర ఎన్నికల కమిషన్‌తో పాటు రిటర్నింగ్ అధికారి, పోలీసులు ఈ వెబ్ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలిస్తారన్నారు.
- బుధవారం సిబ్బంది ఉదయం 7 గంటల వరకు రాజేంద్రనగర్‌లోని ఎన్‌సీసీ గ్రౌండ్ ప్రాంగణానికి హాజరు కావాలని సూచించినట్లు తెలిపారు. అక్కడి నుంచి సిబ్బందికి ఆయా పోలింగ్‌బూత్‌లలో విధులు నిర్ణయించి పోలింగ్ బూత్‌లకు చేరవేస్తామన్నారు.
- 41 రూట్‌ల ద్వారా పోలింగ్ సామగ్రితో పాటు సిబ్బందిని చేరవేస్తామన్నారు. దీనికి 41 సెక్టోరల్ అధికారులను నియమించామన్నారు.
- ప్రతిరూట్‌కు 4–18 బూత్‌లను కేటాయించామని, 41 రూట్‌ల ద్వారా మధ్యాహ్నం 2 గంటల అనంతరం సిబ్బందిని పోలింగ్ బూత్‌లకు చేరవేస్తామన్నారు.
- 6 వేల మంది సిబ్బందికి ఉదయం టిఫిన్లు, మధ్యాహ్నం భోజనాల కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. 542 బూత్‌లలో 1084 ఈవీఎంలు, 542 సీయులు, 542 వీవీ ప్యాడ్ మెషన్లను సిద్ధం చేశామన్నారు. వీటికి తోడు అత్యవసరంగా 20 శాతం ఈవీఎంలను సీయూ, వీవీ ప్యాడ్‌లను సిద్ధంగా ఉంచామన్నారు.

భారీ బందోబస్తు..

నియోజకవర్గంలో ఎన్నికల విధుల కోసం పెద్దఎత్తున పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు డీసీపీ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. స్థానిక పోలీసు సిబ్బందితో పాటు అదనంగా 6 కంపెనీల కేంద్ర బలగాలు, 300 మంది విశాఖపట్నం పోలీసులు, 100 ఆర్మ్‌డ్ ఫోర్స్, 100 ఏపీఎస్పీ పోలీసులను వినియోగిస్తున్నట్లు తెలిపారు.

- నియోజకవర్గంలో సమస్యాత్మకమైన 103 పోలింగ్ బూత్‌లను గుర్తించామని, ఈ బూత్‌ల వద్ద స్థానిక పోలీసులతో పాటు అదనంగా కేంద్ర బలగాలను మోహరిస్తున్నట్లు తెలిపారు.
- క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశామని, ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఈ టీమ్‌లు పనిచేస్తాయన్నారు.
- నిమిషాల వ్యవధిలో ఘటనా స్థలానికి చేరుకునేలా తగిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లను బందోబస్తు కోసం వినియోగిస్తున్నట్లు వివరించారు. ప్రజలు ఎలాంటి పుకార్లను నమ్మొద్దని తెలిపారు.

అభివృద్ధికి కేరాఫ్‌గా మారుస్తా !


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న తోకల శ్రీనివాస్‌రెడ్డి

బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేసే ఎమ్మెల్యే ఉంటే రూపు రేఖలు మారిపోతాయని బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలో సాగర సంఘం, చిత్రపురి కాలనీ వాసులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల అవసరాలకు ఉంచాల్సిన భూములను ప్రభుత్వం అమ్మడంతో కమ్యూనిటీ హాళ్లు, ఆట స్థలాలు, మార్కెట్లు, ప్రభుత్వ కార్యాలయాలకు సైతం భూములు లేకుండా పోతున్నాయన్నారు. నియోజకవర్గంలో అమ్మిన భూముల నిధుల నుంచి కొంత నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు చేస్తే నందనవనంగా మారేదన్నారు. అలాంటివి జరగాలంటే పోరాడే నాయకుడు ఎమ్మెల్యేగా ఉండాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా ప్రత్యేక యాప్, ఫోన్ నెంబర్లు, సోషల్ మీడియాను అందుబాటులో ఉంచుతానన్నారు. మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు బీరప్ప, నాయకులు రాఘవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఇందిరలతో పాటు పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ గెలుపును ఎవరూ ఆపలేరు' !



బండ్లగూడ: నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ గెలుపును ఎవరూ ఆపలేరని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డిలు అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారం చివరిరోజు సందర్భంగా కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్‌లలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి బీఆర్ఎస్ పార్టీకి ఓటువేసి గెలిపించాలని విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజల్లో ఉంటూ ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న ఎమ్మెల్యేను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్పొరేషన్ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు, కో– ఆప్షన్ సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

అసమర్థపాలనకు చరమగీతం


మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

మైలార్‌దేవ్‌పల్లి : నియోజకవర్గంలో అసమర్థ పాలనకు చరమగీతం పాడే రోజు వచ్చిందని నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారం చివరిరోజు కావడంతో ఆయన భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. వేలాదిగా యువత ఈ ర్యాలీలో పాల్గొన్నారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి ఆహ్వానించారు. అనంతరం తోకల మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగురవేసి అసమర్థపాలనకు చరమగీతం పాడటానికి ఓటు ఆయుధంగా మార్చుకోవాలని ఓటర్లకు సూచించారు. అసెంబ్లీలో గళం విప్పి నిధులు రాబట్టుకొస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.

- దేశంలో కేంద్రం అమలు చేసిన అనేక పథకాలను చూసి యువత ఆకర్షితులయ్యారని అభిప్రాయపడ్డారు. బీజేపీ మేనిఫెస్టోతో పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.
- తెలంగాణలో బీజేపీ గెలిస్తే బీసీ నాయకుడిని ముఖ్యమంత్రిని చేస్తానని వాగ్దానం చేశామని ఈ సందర్భంగా గుర్తు చేశారు.
- గత 15 ఏళ్లుగా రాజేంద్రనగర్‌లో ప్రకాష్‌గౌడ్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారన్నారు. నియోజకవర్గంలో దీటైన నాయకుడు లేకే సునాయసంగా గెలిచారన్నారు.
- ప్రస్తుతం బీజేపీ పార్టీ నుంచి ధీటైన యువ నాయకుడు వచ్చాడని ప్రకాష్‌గౌడ్‌ను ఓడించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్పొరేటర్‌గా ఉంటూ.. డివిజన్‌లో అనేక అభివృద్ధి పనులు చేశానన్నారు. ఎమ్మెల్యేగా ప్రజలు గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందన్నారు.
- ప్రజలు కూడా బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని, 30న ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటువేసి ఆశీర్వదించాలని ప్రజలను ఆయన కోరారు.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్


దేవాలయంలో బాండ్‌పై ప్రమాణం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్

మణికొండ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని రాజేంద్రనగర్ అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్ బాండ్ పత్రం రాసిచ్చారు. మంగళవారం ఆయన గ్రామంలోని మల్లన్న దేవాలయంలో పత్రాన్ని చదివి వినిపించి, దానిపై ప్రమాణం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఈ మద్యకాలంలో గెలుపొందిన అన్ని రాష్ట్రాల్లో ఇచ్చిన గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తుందన్నారు. కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని, దాన్ని తిప్పి కొట్టే క్రమంలో ఏకంగా దేవాలయాల్లో ప్రమాణం చేయటంతో పాటు బాండ్ పత్రాన్ని గ్రామస్తులకు రాసిచ్చానన్నారు. గత 10 ఏళ్లుగా రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్ల మందికి ఆశలు పెట్టి వేల మందికి మాత్రమే వాటిని తీర్చిందన్నారు. ఆశలు తీరని వారంతా బీఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటికాలనీ, చిత్రపురి కాలనీలలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పేదలు బాగుపడాలంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెచ్చుకోవాలన్నారు. 24 గంటలు అందుబాటులో ఉండి, పిలిస్తే పలికే నాయకుడిగా తాను సేవలు అందిస్తానన్నారు.

జోరుగా 'కమలం' ప్రచారం

అత్తాపూర్: నియోజకవర్గంలో 'కమలం'ప్రచారం జోరుగా సాగుతోంది. అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల కంటే ప్రచారంలో ముందంజలో ఉందని తెలుస్తోంది. మంగళవారం బహిరంగ ప్రచారం ముగిసే సమయానికి బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి నియోజకవర్గాన్ని రెండుసార్లు పర్యటించారు. బీజేపీ పార్టీ, యువజన, మహిళా విభాగం, ఏబీవీపీ విద్యార్థులు పలు బృందాలుగా విస్తృత్తంగా పర్యటించారు. నగర శివారు నియోజకవర్గమైన రాజేంద్రనగర్‌పై పార్టీ సీరియస్‌గానే పని చేసిందనే చెప్పాలి. ఓటర్ అంతరంగం ఏమిటో గానీ ప్రచారంలో మాత్రం మిగతా అభ్యర్థుల కంటే ముందంజలో ప్రచారం ముగించారు. నగరంలోని గోషామహల్ తర్వాత రాజేంద్రనగర్‌పై పార్టీ ఎక్కువగా కార్యకర్తలను మోహరించి ప్రచారం చేసింది. నగర పాలక సంస్థలోని మూడు డివిజన్లు, రెండు మున్సిపాలిటీలు బీజేపీ ప్రతినిధులు ఉండటంతో రాజేంద్రనగర్ ఎక్కువ ఆశలు పెట్టుకున్నట్లు భావిస్తున్నారు. అభ్యర్థి బంధు, మిత్రులు కూడా ప్రచారంలో విస్తృతంగా పాల్గొన్నారు.

'బీజేపీ విజయాన్ని ఆపలేరు'

శంషాబాద్: నియోజకవర్గంలో బీజేపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని బీజేపీ ఎస్సీ మోర్చా ప్రొటోకాల్ కన్వీనర్ కొప్పుల ప్రశాంత్ అన్నారు. పట్టణంలో మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. 15 ఏళ్లుగా అభివృద్ధిలో వెనకబడిన రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ గెలుపుతోనే మార్పు సాధ్యమవుతుందన్నారు. ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి విద్యావంతుడైన బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలన్నారు.

సాతంరాయిలో..

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్ గుప్తా పట్టణంలోని సాతంరాయిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. బీజేపీ గెలుపు నల్లేరుమీద నడకేనని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనతో ప్రజలు తీవ్రంగా విసిగిపోయారన్నారు. బీజేపీ నేత ధన్నాడ వెంకటేష్ తదితరులున్నారు.

ఎంఐఎం ప్రచారం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో మజ్లిస్ పార్టీ అభ్యర్థి స్వామియాదవ్ ఎమ్మెల్సీ రహమత్ బేగ్‌తో మంగళవారం రోడ్‌షో, పాదయాత్రలు నిర్వహించారు. ప్రచారానికి తుదిరోజు కావడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్దఎత్తున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా స్వామియాదవ్ మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలంతా మజ్లిస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి మజ్లిస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ నియోజకవర్గంలో విస్తృత్తంగా పర్యటించారన్నారు. అన్ని వర్గాల ప్రజలు సహకరిస్తున్నారని, తప్పక విజయం సాధిస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన ప్రచారం..ప్రలోభాల పర్వం షురూ !


వట్టినాగులపల్లిలో పోలింగ్ చీటీలను సిద్ధం చేస్తున్న కార్యకర్తలు

మణికొండ: ఎన్నికల ప్రచారం ముగియడంతో నియోజకవర్గం సైలెంట్‌గా మారింది. గత 20 రోజులుగా హోరెత్తిన ప్రచారంతో ఎటుచూసినా రాజకీయ నాయకులు, కార్యకర్తలే దర్శనమిచ్చారు. మంగళవారం సాయంత్రంతో ఓటర్లను పోలింగ్‌బూత్‌లకు తీసుకొచ్చే పనిలో పలు పార్టీల కార్యకర్తలు నిమగ్నమయ్యారు. పోలింగ్ చీటీలు రాయటం, వాటిని ఓటర్లకు చేరవేయటం, వారిని మచ్చిక చేసుకునేందుకు అక్కడక్కడ డబ్బు, మద్యం పంపిణీలను చేపడుతున్నట్టు సమాచారం. కొంతమంది ఓటర్లు సైతం తమ వద్ద ఇన్ని ఓట్లు ఉన్నాయని, తమకు ఏమిస్తారనే బేర సారాలకు దిగుతున్నట్టు రాజకీయ నాయకులు చెబుతున్నారు. ఇతర పార్టీలకు చెందిన వారు ఓటర్లకు ఏమిస్తున్నారు, దానికి ధీటుగా తమ పార్టీ తరఫున ఏమివ్వాలనే ఆలోచనలు చేసి తమ అభ్యర్థులకు చేరవేయటంతో ద్వితీయ శ్రేణి నాయకులున్నారు. వారి సలహాలకు అనుగుణంగా అభ్యర్థులు మంగళ, బుధవారాల్లో పంపిణీకి సిద్ధమవుతున్నట్లు వినికిడి. పార్టీల నాయకులు ఇచ్చే తాయిలాలకు తలొగ్గిని వారు వారికి అనుకూలంగా ఓటు వేస్తారా.. లేక ఇప్పటికే నిర్ణయించుకున్న అభ్యర్థికే ఓటు వేస్తారా.. అనే విషయం పోలింగ్ జరిగి, ఫలితాలు వచ్చాకనే తేలే అవకాశం ఉంటుందని ఆయా పార్టీల నాయకులు పేర్కొంటున్నారు.

చివరి రోజు వివిధ పార్టీల నాయకుల ప్రచారం...

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పలు పార్టీలకు చెందిన అభ్యర్థులు వారి అనుచరులు మంగళవారం ప్రచారానికి చివరిరోజు కావడంతో పెద్దఎత్తున ర్యాలీలు, ఇంటింటి ప్రచారం చేపట్టారు. బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి రాజేంద్రనగర్‌లో రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీనగర్, హనుమాన్‌నగర్, మాణిక్యమ్మ కాలనీ ప్రాంతాల్లో స్థానికులతో కలిసి సమావేశం నిర్వహించి, కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. సూరంపల్లిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేయగా.. ప్రధాన పార్టీ అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు సైతం బైక్ ర్యాలీలు నిర్వహించారు.

మహాత్మ జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

రాజేంద్రనగర్: మహాత్మ జ్యోతిరావు పూలే వర్థంతిని రాజేంద్రనగర్‌లో ఘనంగా నిర్వహించారు. మంగళవారం నియోజకవర్గ మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి కమిటీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ విజయం ఖాయం

బీఆర్ఎస్ అభ్యర్థి ప్రకాష్‌గౌడ్



మైలార్‌దేవ్‌పల్లి: రాష్ట్ర ప్రజలకోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండే వ్యక్తి సీఎం కేసీఆర్ అని ప్రకాష్‌గౌడ్ అన్నారు. డివిజన్‌లోని ప్రేమావతిపేట్, భవాని కాలనీ, మధుబన్‌కాలనీ, పద్మశాలిపురం, బాబుల్‌రెడ్డి నగర్‌లో భారీ రోడ్‌షో నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ అభ్యర్థిగా నాల్గోసారి ప్రజలు విజయం వైపు తీసుకెళ్తున్నారన్నారు. అభివృద్ధికి మారుపేరుగా నిలిచినందుకే ప్రజలు మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. ప్రతి పేదవాడి ఇంటా కేసీఆర్ పథకాలను ఆస్వాధిస్తున్నారని గుర్తు చేశారు. తెలంగాణలో కేసీఆర్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని జోశ్యం చెప్పారు. నియోజకవర్గ ప్రజలు నాల్గోసారి గెలిపించి కేసీఆర్‌కు కానుకగా పంపనున్నారని అభిప్రాయపడ్డారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మాజీ కార్పొరేటర్ ప్రేమ్‌దాస్‌గౌడ్, సోమ శ్రీనివాస్, ఎస్ వెంకటేష్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బైక్‌ర్యాలీ

మైలార్‌దేవ్‌పల్లి: 'మార్పు రావాలంటే బీజేపీ జెండా ఎగరాలి'.. అంటూ బీజేపీ యువ నాయకుడు ఎల్.వీ.రెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం టీఎన్జీఓస్ కాలనీ నుంచి తోకల శ్రీనివాస్‌రెడ్డి నిర్వహిస్తున్న బైక్ ర్యాలీకి ఆయన తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 15 ఏళ్లుగా మధుబన్ కాలనీ, టీఎన్జీఓస్ కాలనీల్లో అభివృద్ధి జరగలేదని, అభివృద్ధి చేసే వారికి ఓటువేసి గెలిపించుకుంటామన్నారు. యువతకు విద్యావంతుడు, యువకుడు ఎమ్మెల్యేగా రావాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.